3న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జనగామ, న్యూస్‌టుడే: హనుమకొండలో అక్టోబరులో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేసేందుకు అక్టోబరు 3న జనగామలోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్ది వెంకటనారాయణగౌడ్, మనోజ్‌కుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16, 18, 20 సంవత్సరాల విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 98850 46437, 99124 53220 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారం కోసం కక్షిదారులు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు. నాలుగు బెంచ్‌ల ద్వారా కేసులను పరిష్కరించారు. మొదటి బెంచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ, రెండో బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, మూడో బెంచ్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, నాలుగో బెంచ్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సందీప కేసులను పరిష్కరించారు. మొత్తం 192 సివిల్, 958 క్రిమినల్, 1,827 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి.. లయ తప్పొద్దు


నేడు ప్రపంచ హృదయ వ్యాధుల నివారణ దినం

గుండె జబ్బులు వచ్చిన తర్వాత పరుగులు తీయడమే తప్ప అవి రాకుండా నివారించే విధానాలపై చాలామంది ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగానే గుండెపోటుకు గురయ్యే వారి సంఖ్య పెరిగిపోతోంది. గుండె శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితికి తావులేకుండా జీవన శైలిలో మార్పులతో ప్రకృతితో కలిసి జీవనం సాగించడం ద్వారా గుండెను జీవితాంతం సురక్షితంగా ఉంచుకోవచ్చని ప్రకృతి వైద్యులు సూచిస్తున్నారు. నిత్య వ్యాయామంతో బరువు నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు కొవ్వును కరిగించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నేడు ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినం సందర్భంగా కథనం..

–న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

నేడు కేఎంసీలో అవగాహన

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలోని ఎన్ఆర్ఐ భవన్‌లో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామక శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ వర్గాల వారికి అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.



తృణధాన్యాలు
కొర్రలు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటివి తీసుకోవాలి. బార్లీ, బీన్స్, కాయ ధాన్యాలు, శనగలు, చిక్కుళ్లు ఎక్కువగా తినాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి.. రక్తంలో చక్కెరను నియంత్రిస్తాయి.

ఆకు, కాయగూరలు
బచ్చలికూర, కాలీఫ్లవర్, టమాట, క్యాబేజీ, క్యారెట్, పాలకూర, వంటి తాజా కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు సహా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. బరువును నియంత్రించడానికి సహాయపడతాయి.

బెర్రీలు
స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్బెర్రీలు వంటివి యాంటీ ఆక్సిడెంట్లతో, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్‌తో నిండి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ, ఒత్తిడి, వాపు, గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తాయి. సి విటమిన్ అధికంగా ఉండే పండ్లు తీసుకోవాలి.

చేపలు, నూనెలు
మాకేరెల్, సార్డినెస్, ట్యూనా వంటి చేపల్లో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ట్రైగ్లిజరైడ్‌లను, మంటను తగ్గిస్తాయి. గుండె లయను మెరుగుపరుస్తాయి.

వాల్‌నట్‌లు
వాల్‌నట్‌లు, బాదం, పిస్తా, గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫైబర్, పొటాషియమం, మెగ్నీషియం లభిస్తాయి. అవిసె గింజల్లో ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కొలెస్ట్రాల్, మంటను తగ్గిస్తాయి.

వెల్లుల్లి
రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. ప్రతి రోజు 1-2 గ్రాముల వెల్లుల్లి దంచి పాలలో వేసి మరిగించి తాగడంతో గుండెకు బలంతో పాటు, చర్మరోగాలు, కీళ్లనొప్పులు తగ్గుతాయి.

గ్రీన్ టీ
యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. జీవక్రియను పెంచడం, శరీర కొవ్వును నియంత్రించడం, ఇన్సులిన్ సెన్సిటివ్ మెరుగుపర్చి బరువును నియంత్రిస్తుంది.

వ్యాయామం అవసరమే
శరీర వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలి. నిపుణుల పర్యవేక్షణలో యోగా చేయడం ద్వారా అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. గుండెకు మేలు చేస్తుంది.

ప్రకృతి జీవన విధానాన్ని అనుసరిస్తున్నా..

- అచ్చ వినోద్‌కుమార్, విద్యానగర్ కాలనీ, వరంగల్



గుండె సంబంధిత సమస్య రాగానే ఓ పెద్ద ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకున్నాను. మా కూతురు ప్రకృతి వైద్యురాలు కావడంతో నా జీవన విధానం, ఆహార అలవాట్లను మార్చేసింది. తృణ ధాన్యాలు, పిస్తా, బాదం, వాల్‌నట్, చిక్కుళ్లు ఉండేలా చూస్తాను. అన్నం, చక్కెర, ఉప్పు పూర్తిగా తగ్గించాను. ఇప్పుడు ఎలాంటి సమస్యలు లేవు.

పూర్వీకుల నుంచి నేర్చుకోవాలి..

- డాక్టర్ మైదం రాజు, ఆయుష్ వైద్యులు



మన పూర్వీకుల ప్రకృతి జీవన విధానానికి మనం దూరంగా ఉండటం వల్లనే గుండె జబ్బులు వస్తున్నాయి. మంచి ఆహారం, నిద్ర అవసరం. ఆందోళన, ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర, వరి అన్నం వదిలి తృణ ధాన్యాలు తీసుకోవాలి, ధ్యానం, యోగాసనాల ద్వారా గుండె జబ్బుల నుంచి బయటపడొచ్చు.


కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండె వైద్యం కోసం వరుస కట్టిన రోగులు

కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో జనవరి నుంచి ఇప్పటివరకు చికిత్స వివరాలు	కార్డియాలజీ ఓపీ	యాంజియోగ్రామ్	స్టంట్లు	2డి ఏకో పరీక్షలు	ఈసీజీ పరీక్షలు
	25,444	634	212	22,980	16,522

పల్లె ఓటర్ల జాబితా సిద్ధం

జనగామ అర్బన్, జనగామ, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నెల 6న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాపై 14 నుంచి 21 వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. 26న జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో అభ్యంతరాలను పరిష్కరించారు. ఓటరు తుది జాబితాను శనివారం జిల్లా పంచాయతీ అధికారిణి స్వరూప విడుదల చేశారు. మొత్తం 12 మండలాల్లోని 283 పంచాయతీల పరిధిలో ఉన్న 2,576 వార్డుల్లో 4,09,797 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,03,097 మంది కాగా మహిళలు 2,06,696 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
బచ్చన్నపేట	18,764	19,476	1
చిల్పూర్	16,126	16,385	1
దేవరుప్పుల	18,247	18,230	0
స్టేషన్‌ఘన్‌పూర్	21,605	22,340	0
జనగామ	16,525	16,622	0
కొడకండ్ల	14,063	14,277	2
లింగాలఘనపురం	15,987	16,533	0
నర్మెట్ట	9,941	10,165	0
పాలకుర్తి	25,670	26,010	0
రఘునాథపల్లి	21,783	22,104	0
తరిగొప్పుల	7,823	7,785	0
జఫర్‌గఢ్	16,563	16,769	0

ఉపాధ్యాయ సంఘాల నేతల నిరసన



జనగామ అర్బన్, న్యూస్‌టుడే: అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయి రిలీవ్ కాని ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచరు, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడితే వెంటనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, ఆ ప్రక్రియ ఆలస్యమైతే విద్యా వాలంటీర్లను నియమించాలని, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ బాధ్యులు డి.శ్రీనివాస్, బి.లక్ష్మయ్య, చంద్రశేఖర్‌రావు, ఇ.రాంరెడ్డి, శాడ రవి, ఎన్ఎన్ రాజు, శ్రీనివాసరావు, దివాకర్‌రెడ్డి, అంకుశావలి, కృష్ణమూర్తి, జగ్గారెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఉత్తరం.. తాతా నానమ్మల సంబరం


ఉత్తరాలు రాస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: చరవాణుల వినియోగం పెరిగిపోయిన నేటి తరుణంలో బంధువులకు ఉత్తరాలు రాయడంపై విద్యార్థులకు అవగాహన లేకుండా పోయింది. ఎంతో ఆత్మీయతను పంచే లేఖా రచనపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నర్మెట్టలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఇటీవల వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులతో వారి నానమ్మ, అమ్మమ్మ, తాతలకు లేఖలు రాయించారు. పత్తిపాక ఫౌండేషన్, గరిపల్లి ట్రస్టుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన

ఎక్కడో దూరంగా ఉన్న అమ్మమ్మ, నానమ్మ, తాతలకు లేఖలు రాసే అలవాటును పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు సంకల్పించారు. ఉపాధ్యాయులు తమ వద్ద ఉన్న ఉత్తరాలను పిల్లలకు చూపించి అవగాహన కల్పించారు. ఉత్తరాలు ఎలా రాయాలో వివరించారు. పిల్లల అమ్మమ్మ, తాతలు ఉండే ఊళ్ల వివరాలను తెలుసుకున్నారు. తపాలా సిబ్బంది ద్వారా పిన్ కోడ్, మండలం తదితర వివరాలను సేకరించి విద్యార్థులకు అందించారు. విద్యార్థులు రాసిన లేఖల్లో.. తాత అమ్మమ్మల ఆరోగ్యం గురించి వాకబు చేశారు. సమయానికి మందులు వేసుకోవాలని సూచించారు. దసరా సెలవులకు ఊరికి వస్తామని తెలిపారు. పత్తిపాక ఫౌండేషన్, గరిపల్లి ట్రస్టుల ప్రతినిధులు విద్యార్థులకు అవసరమైన కవర్లు అందజేశారు. విద్యార్థులు రాసిన ఉత్తరాలను తపాలా కార్యాలయంలోని తపాలా పెట్టెలో వేశారు.

మా అమ్మమ్మ మురిసిపోయింది: అపర్ణ, 9వ తరగతి, జడ్పీ ఉన్నతపాఠశాల, నర్మెట్ట



మా బడిలో ఉపాధ్యాయులు అమ్మమ్మ, నానమ్మ, తాతలకు మాతో లేఖలు రాయించారు. ఉత్తరాలు ఎలా రాయాలో నేర్చుకున్నాం. తెల్లకాగితం మీద ఒకటి రెండు సార్లు అభ్యాసం చేసి అనంతరం ఉత్తరాలు రాశాం. లేఖ అందిందని మా అమ్మమ్మ రెండు రోజుల క్రితం ఫోన్‌చేసి చెప్పింది. చాలా ఏళ్లకు ఇంటికి పోస్టుమ్యాన్ వచ్చి ఉత్తరం ఇచ్చాడని మురిసిపోయింది. ఇక నుంచి ఎవరికి సమాచారం ఇవ్వాలన్నా ఉత్తరాలు రాయాలని నిర్ణయించుకున్నాం.

రేబిస్‌పై అప్రమత్తత అవసరం



వివరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ, న్యూస్‌టుడే: రేబిస్ వ్యాధిపై అన్ని వర్గాలకు అవగాహన, అప్రమత్తత అవసరమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రాధాకిషన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ భవితకు సోపానం

జనగామ: ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు విద్యార్థి దశ కీలకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠాలను శ్రద్ధగా విని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపల్ పావనికుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వరి.. హరిత సిరి!

చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. సమీపంలో సాగు చేస్తున్న పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. లింగాలఘనపురం మండలం చీటూరులోని చెరువుకట్ట దిగువ భాగంలో రైతులు వరి పంట సాగు చేశారు. పైర్లు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, జనగామటౌన్

పల్లె సంస్కృతి తెలుసుకోవడమే జానపదం



ప్రసంగిస్తున్న డీఈవో రాము

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: పల్లె సంస్కృతిని తెలుసుకోవడమే జానపదమని జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము అన్నారు. జనగామలోని ఏకశిల బీఈడీ కళాశాలలో శనివారం జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలను జిల్లా విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ డీఈవో మాట్లాడుతూ.. పల్లె సంస్కృతిలో జానపద నృత్యాలకు విశేష ఆదరణ ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో జానపద నృత్యాలపై విద్యార్థులకు చక్కటి అవగాహన కలుగుతుందన్నారు. పోటీల్లో పాలకుర్తి మండలం వావిలాల-జడ్పీహెచ్ఎస్ ప్రథమ, కొడకండ్ల గురుకుల పాఠశాల ద్వితీయ, రఘునాథపల్లిలోని సెయింట్ ఆల్ఫోర్స్ పాఠశాల తృతీయ బహుమతులు సాధించాయి. విజేతలకు డీఈవో నగదు బహుమతులు అందజేశారు. విజేతలు వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరాంజని, హిమబిందు, రజిత, రాణి, దామెర ఉపేందర్, ఉపాధ్యాయులు అనీల్, నవీన్, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బచ్చన్నపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రాము అన్నారు. బచ్చన్నపేటలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఈవో బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇర్రి వెంకట్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి శనివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ నగర శివారులోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహిస్తున్న అండర్-19 క్రికెట్ పోటీలను కుడా(కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు కేంద్రంగా 'కుడా' ఆధ్వర్యంలో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూల్ 'ఏ'లో వరంగల్, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు, పూల్ 'బీ'లో ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 30 వరకు పూల్ ఏ, అక్టోబరు 1 నుంచి 3 వరకు పూల్ బీ జట్లు లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఆడుతాయన్నారు. అక్టోబరు 4, 5 తేదీల్లో సెమీస్, ఫైనల్స్ ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉపేందర్, ఖాజా, రాము, కుమార్, మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, ప్రభాకర్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

తొలి మ్యాచ్‌లో ఓటమి: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అహ్మద్ 38 పరుగులు చేశాడు. ఛేదనలో వరంగల్ జట్టు 29.4 ఓవర్లలో 87 పరుగులకు కుప్పకూలింది. 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మహబూబ్‌నగర్ బౌలర్ ముకేత్ 3 వికెట్లు, అహ్మద్ 2 వికెట్లు తీశారు.



క్రికెటర్ల పరిచయ కార్యక్రమంలో 'కుడా' ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి

5 వికెట్ల తేడాతో నల్గొండ విజయం: కోమటిపల్లి క్రికెట్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 21.2 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి విజయం సాధించింది. విష్ణువర్ధన్ 37 పరుగులతో పాటు 3 వికెట్లు తీసి రాణించాడు.

నేటి మ్యాచ్‌లు

29న వరంగల్ X మెదక్ (మొగిలిచర్ల మైదానం),
నల్గొండ X మహబూబ్‌నగర్ (కోమటిపల్లి మైదానం)

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శకులు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ మంత్రముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటున్న చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి







సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందడోలికల్లో తేలుస్తున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించేందుకు కనే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినిమాట్లలో విహరిస్తూ ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మెస్మరైజ్ షో, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీచికలతో పండగల వేళ చిన్నాపెద్ద ఆనందిస్తున్నారు. ఇందుకోసం ఆలస్యం ఎందుకు.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు మరి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు ఈ సౌకర్యం వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

అవివాహితులకు సువర్ణావకాశం

● **నేడు మేరు/దర్జీ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి, వరంగల్ మేరు సంఘం సంయుక్త సహకారంతో ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్**



మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి.నెట్ మేరు/దర్జీ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నిర్వహిస్తోంది. వరంగల్ ఎల్లంబజార్‌లోని శ్రీరామ మేరు సంఘం భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు ఆదివారం(సెప్టెంబరు 29) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయో డేటా, ఫొటోలు వాట్సప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు. పూర్తి వివరాలకు 83744 45190, 80080 02165 సంప్రదించవచ్చు.

వ్యాన్ బోల్తా.. 13 ఆవుల మృతి

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల శివారులో శనివారం వేకువజామున ఓ వ్యాన్ బోల్తా పడడంతో 13 ఆవులు మృతి చెందాయి. మరి కొన్నింటికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాద్‌కు వ్యాన్‌లో ఆవులను తరలిస్తున్నారు. అతివేగం కారణంగా వావిలాల శివారులోని మూల మలుపు వద్ద వ్యాన్ బోల్తా పడింది. వాహనంలో 51 ఆవులు, లేగదూడలు ఉండగా 13 ఆవులు మృతి చెందాయి. మిగతా ఆవులను పోలీసులు పాలకుర్తిలోని గోశాలకు తరలించారు. గాయపడిన ఆవులకు పశువైద్యాధికారులు చికిత్స అందించారు. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని సమాచారం. సంఘటన స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి సందర్శించారు.

ప్రమాదకరంగా మలుపు: వావిలాల శివారులోని మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ నెల 3న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టగా.. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి.

పదేళ్లు గడిచినా పాత సూచికలేనా!



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటింది. ఉమ్మడి వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించారు. ప్రధాన రహదారులపై ఇంకా పాత బోర్డులే దర్శనమిస్తున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద ప్రధాన రహదారిలో ఇలా ముగింపు, ప్రారంభం బోర్డులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుమీదే ఉన్న చిత్రం ఇది.

– ఈనాడు, హనుమకొండ

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయల్లో)

వెన్‌కాబ్	
ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

నిరాశ్రయులైన పేదలకు న్యాయం చేయండి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

జనగామఅర్బన్, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలం తొర్రూరు(జె)లో పేదల సొంత స్థలంలో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు నిర్మిస్తే వాటిలో నివసిస్తున్న పేద కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా ఖాళీ చేయించిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు విన్నవించారు. ఎర్రబెల్లి శనివారం బాధిత కుటుంబాలతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. నిరాశ్రయులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టా భూముల్లోనే ఇళ్లు కట్టించామని, గ్రామ సభ తీర్మానం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించామని, పేదలకు ఒక్కరోజులో పరిష్కారం చూపాలని కోరారు. రిజ్వాన్ బాషా పరిశీలించి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం దయాకర్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఇంకా వెయ్యి ఇళ్లు పునాది స్థాయిలో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపడం లేదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని రిజర్వాయర్ల నిర్మాణం, చెక్‌డ్యామ్‌లు, బమ్మెర పోతన, పాల్కురికి అభివృద్ధి పనులన్నీ ఆగిపోయాయని, వాటిని త్వరగా పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు పదోన్నతులు


సంతోషి, ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్

వరంగల్ న్యాయ విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ఎం. సంతోషి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు(పీపీ)లకు పదోన్నతి కల్పించి బదిలీలు చేస్తూ రాష్ట్ర ప్రత్యేక చీఫ్ సెక్రటరీ రవిగుప్తా ఆదేశాలు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా సహాయక సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎం.సంతోషికి గ్రేడ్-1 పదోన్నతి కల్పించి వరంగల్ ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానానికి పీపీగా బదిలీ చేశారు. అలాగే ఈమె ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్‌గా కొనసాగనున్నారు. హనుమకొండ ప్రధాన సహాయక సెషన్ కోర్టులో పీపీ గ్రేడ్-2గా పనిచేస్తున్న జి.భద్రాద్రి రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు గ్రేడ్-1 పీపీగా.. వరంగల్ సహాయక సెషన్స్ కోర్టు పీపీగా పనిచేస్తున్న ఎల్‌హెచ్ రాజేశ్వర్‌రావు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ గ్రేడ్-1గా వెళ్తున్నారు.

‘తపాస్‌పల్లి నీటిని తరలిస్తే ఊరుకోం’

జనగామ టౌన్, న్యూస్‌టుడే: తపాసుపల్లి రిజర్వాయర్ నీటిని చేర్యాల ప్రాంతంలోని చెరువులకు విడుదల చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం జనగామలో విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, దూళ్మిట్ట, మద్దూరు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల్లోని చెరువులకు తపాసుపల్లి జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తపాసుపల్లి జలాశయాన్ని సందర్శించారు.. ఆలేరు ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయించుకునేందుకు ప్రధానకాల్వ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలతో గేటు వాల్వ్‌ను తెరిపించడం సరికాదన్నారు. చేర్యాల ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన తపాసుపల్లి రిజర్వాయర్ నీటిని స్థానిక రైతులకు ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా
జనగామ: 80085 74872
వరంగల్ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

దోమల నివారణకు చర్యలు

స్పందనకు వందనం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్‌లో పలు వార్డుల్లో మురుగు కాల్వల్లో దోమలు విపరీతంగా ఉండి రాత్రివేళ స్వైర విహారం చేయడంతో కంటిమీద కునుకులేకుండా పోతోందని పలువురు గ్రామస్థులు ‘న్యూస్‌టుడే’ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి పంచాయతీ సిబ్బందితో పలు వార్డుల్లో దోమల నివారణకు మందును పిచికారీ చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామలోని వైద్య కళాశాల, జిల్లా జనరల్ ఆసుపత్రిలో పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగాల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారం ముగిసింది. ల్యాబ్ అటెండెంట్ 177, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ 18, సిటీ టెక్నీషియన్ 5, ఈసీజీ టెక్నీషియన్ 10, అసిస్టెంట్ టెక్నీషియన్ 20, డోబీ 26, ప్లంబర్ 5, ఎలక్ట్రీషియన్ 77, డేటా ఎంట్రీ ఆపరేటర్ 422, డ్రైవర్ 38, థియేటర్ అసిస్టెంట్ 46, గ్యాస్ ఆపరేటర్ 11, వార్డు బాయ్ ఉద్యోగానికి 202 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కూడా అధికారులు ప్రారంభించారు. వైద్య కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్ పయాం ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు


సమావేశంలో పాల్గొన్న పండితులు

శైవాగమశాస్త్రం సర్వజనహితం

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తిలో శనివారం తెలంగాణ ఆది శైవ బ్రాహ్మణ పండిత పరిషత్ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. సోమేశ్వరాలయ అర్చకుడు అనిల్‌శర్మ ఆధ్వర్యంలో ఆగమశాస్త్రంపై పండితులు, అర్చకులు చర్చించారు. అనిల్‌శర్మ మాట్లాడుతూ శైవాగమశాస్త్రం సర్వజనహితమన్నారు. ఈ శాస్త్రం మానవాళి జీవనశైలికి మార్గ దర్శనమన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం శైవాగమ పండితులు పరమేశ్వర శివాచార్య, శివకిరణ్ శివాచార్య, రవి శివాచార్య, దేవగిరి సునీల్‌శర్మ, సంతోష్‌శర్మ, శ్యామ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్బంధ తనిఖీలు


మాట్లాడుతున్న ఏసీపీ భీంశర్మ

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రఘునాథపల్లిలో శనివారం సాయంత్రం పోలీసులు కట్టడి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ భీంశర్మ నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 25 వాహనాలను సీజ్ చేశారు. పలువురు వాహన చోదకులకు జరిమానా విధించారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై, నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్న వ్యక్తిపై కేసులు నమోదు చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఏసీపీ భీంశర్మ మాట్లాడుతూ మత్తు పదార్థాల సరఫరా, వినియోగం సహించబోమన్నారు. వాహనాలకు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఏసీపీ వివరించారు. కార్యక్రమంలో జనగామ రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, వేణు, స్థానిక ఎస్సై డి.నరేశ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సై శ్రవణ్, ఏఎస్సై రాజమౌళి, హెడ్ కానిస్టేబుళ్లు సయ్యద్ నాసర్, మాధవరావు, కానిస్టేబుళ్లు యుగేందర్, వీరేందర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల జననం



బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట మండలం బసిరెడ్డి పల్లిలో శనివారం రాగిపెల్లి బుచ్చయ్యకు చెందిన ఓ గొర్రె 8 కాళ్ల పిల్లకు జన్మనిచ్చింది. రెండు గంటల తర్వాత మృతి చెందినట్లు బుచ్చయ్య తెలిపారు.

అటవీశాఖాధికారులపై దాడికి పాల్పడిన నిందితులు ఖమ్మం జైలుకు

తాడ్వాయి, న్యూస్‌టుడే: ములుగు జిల్లా తాడ్వాయి మండలం దామెరవాయిలో గురువారం రాత్రి అటవీశాఖాధికారులపై దాడి చేసిన నిందితులను ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్‌చంద్రపై తాడ్వాయికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టి దాడికి పాల్పడిన తాడ్వాయికి చెందిన గంట సూరజ్‌రెడ్డి, గంట శశిధర్, జేసీబీ డ్రైవర్ నీరటి శ్రీకాంత్‌తో పాటు నిందితులకు సహకరించిన డ్రైవర్ మాదరి చంటి, పాండవుల సాయిరవిచంద్రలను ములుగు కోర్టులో హాజరు పరిచి ఖమ్మం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

2న చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి ర్యాంకింగ్ టోర్నీ పోటీలు ఉంటాయని నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. అక్టోబరు 2న హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని తుశారా ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 90595 22986 సంప్రదించాలన్నారు.

1న డీఈఈ సెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఈఈ సెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన అక్టోబర్ 1న డైట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ప్రీ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గతంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని వారు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90304 92595 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వైద్యాధికారిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చేపట్టిన రవీందర్‌గౌడ్‌ను శనివారం అధికారులు, కార్యాలయ సిబ్బంది సత్కరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో అన్ని కార్యక్రమాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రోగ్రాం అధికారులు మల్లికార్జున్, శ్యామ్, భాస్కర్, ఉద్యోగులు ప్రభాకర్, జయపాల్‌రెడ్డి, సాంబయ్య, హేమానాయక్, రమాదేవి పాల్గొన్నారు.

‘భాజపా పాలనలో మహిళలకు రక్షణ కరవు’

జనగామ టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అహల్య, జిల్లా కార్యదర్శి షబానా అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భాజపా పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఐద్వా పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా బండ రమాదేవి, కార్యదర్శిగా పందిళ్ల కల్యాణి, సహాయ కార్యదర్శులుగా కొమ్మగల్ల మణి, సౌందర్య, ఉపాధ్యక్షులుగా బాలమణి, మానస, గౌసియా, నాగమణి, రజిత తదితరులు ఎన్నికయ్యారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక వికాసం, శారీరక దారుఢ్యతను పెంపొందిస్తాయని డీఈవో రాము అన్నారు. మండల స్థాయి క్రీడాకారుల ఎంపికకు 68వ స్కూల్ గేమ్స్ క్రీడోత్సవాలను స్థానిక ఉన్నత పాఠశాలలో డీఈవో శనివారం ప్రారంభించారు. అండర్ 14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో 310 మంది పాల్గొన్నారు. ప్రతిభావంతులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవో విష్ణుమూర్తి తెలిపారు. కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, శ్రీలత, పీడీ పీఈటీలు కిష్టయ్య, అశోక్, గోర్‌సింగ్, ఇంద్రసేనారెడ్డి, శరత్, సంజీవ్, సుశీల, సుధారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేడుకగా బుగులు వెంకన్న కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్పూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి వార కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి మల్కాపూర్ గ్రామానికి చెందిన కేశిరెడ్డి కల్యాణ్, అనుపమ వెండి పంచ పాత్రలు గిన్నెతో సహా బహూకరించారు. కార్యక్రమంలో అర్చకులు బి.రవీందర శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పాఠశాల ప్రిన్సిపల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ మండలం పెంబర్తిలోని మహాత్మ జ్యోతిరావుపులే బాలికల పాఠశాల ప్రిన్సిపల్ అనిత శనివారం ద్విచక్రవాహనంపై జనగామకు వెళుతుండగా.. పెంబర్తి వద్ద మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. అనితకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

సంక్షిప్తంగా

‘జిల్లాలో అదుపు తప్పిన పాలన’

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని శాఖల్లో పాలన అదుపు తప్పిందని, అధికారులు అవినీతికి పాల్పడుతూ అనిశాకు చిక్కుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అవినీతికి పాల్పడుతూ జిల్లాకు మచ్చ తెస్తున్నారన్నారు. ఇప్పటి వరకు రెండుసార్లు కలెక్టరేట్‌లో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడటం సిగ్గుచేటన్నారు. జిల్లాలో మెరుగైన పాలన అందేలా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అజార్, కల్యాణం లింగం, శ్రావణ్, కల్యాణి, బీరయ్య, గట్టయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేయాలి

జనగామ: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పార్టీ నాయకులపై కక్ష సాధింపు వైఖరితో వ్యవహరిస్తున్నారని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పార్టీ అసంతృప్తివర్గ నాయకులు అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్, మార్కెట్ మాజీ ఛైర్మన్ వై.సుధాకర్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కంచ రాములు ఆధ్వర్యంలో శనివారం జనగామలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రత్యర్థి పార్టీ నాయకుడి నుంచి రూ.3 కోట్లు తీసుకున్నట్లు చేసిన ఆరోపణపై కొమురవెల్లి మల్లన్న ముందు ప్రమాణానికి సిద్ధం కావాలని వై.సుధాకర్ సవాల్ చేశారు. సమావేశంలో నాయకులు కొత్త కరుణాకర్‌రెడ్డి, గనిపాక మహేందర్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

జనగామ టౌన్: ఇటీవల చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్కడి పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జనగామలోని నెహ్రూ పార్కు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు ఆర్య, రాజు, అఖిల, పల్లవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

జనగామ టౌన్: ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభను అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, భూక్య చందూనాయక్, జోగు ప్రకాష్, షబానా, కల్యాణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లి, కొడవటూర్ గ్రామాల్లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి రామారావు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు నర్సింహాచారి, రూపచైతన్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అవగాహన

దేవరుప్పుల రూరల్: రంబోజీగూడెంలో శనివారం 335 మంది గీత కార్మికులకు రక్షణ మోకులపై అవగాహన కల్పించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రవీందర్, ఎక్సైజ్‌శాఖ అధికారులు మోకుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా కోఆర్డినేటర్ వెంకటమల్లయ్య, గూడ రవీందర్, మొలుగూరి సంతోష్, పోతుల ఆంజనేయులు, పరీదుల భాస్కర్, గొడిశాల శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

దేవరుప్పుల రూరల్: చిన్నమడూరులో జరుగుతున్న మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 144 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంఈవో కళావతి, పీడీలు ప్రవీణ్‌కుమార్, కిరణ్, పాండ్యా, యాదగిరి, ప్రణీత, రవికుమార్, తోటకూరి పాండుక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ మార్గం అనుసరణీయం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: భగత్ సింగ్ ఉద్యమ మార్గంలో విద్యార్థులు పయనించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో ఆ సంఘం మండల కార్యదర్శి పొదల లవకుమార్ ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు యాకన్న, ఆర్య, వంశీ, మహేశ్, అక్షిత్ పాల్గొన్నారు.

రైతుల చేతిలో కొండచిలువ హతం



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన బండ లింగయ్య అనే రైతు వ్యవసాయ బావి వద్ద శనివారం కొండచిలువ ప్రత్యక్షమైంది. రోజు మాదిరిగానే రైతు పశువుల కోసం గడ్డివాము నుంచి గడ్డిని లాగుతుండగా ఒక్కసారిగా గడ్డిలోంచి కొండచిలువ బయటపడింది. చుట్టుపక్కల ఉన్న రైతుల సాయంతో దానిని కర్రలతో కొట్టి చంపేశారు. రైతు అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు. గ్రామంలో తరచూ కొండచిలువలు వస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

చిల్పూర్: మండలంలోని లింగపల్లి గ్రామంలో రైతు వేముల రాజు వ్యవసాయ బావి వద్ద శనివారం వరి కోత మిషన్ సాయంతో వరి కోస్తుండగా.. వరిలో నుంచి కొండ చిలువ మిషన్‌లో చిక్కుకొని చనిపోయింది.

బ్యాటరీ పేలి బైక్, పత్తి దగ్ధం



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మండలంలోని చీటూరు గ్రామంలో శనివారం విద్యుత్తుతో నడిచే ద్విచక్ర వాహనం బ్యాటరీ పేలి బైక్, పత్తి దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబటి నాగిరెడ్డి ఏడాది క్రితం విద్యుత్తు ద్విచక్ర వాహనం కొనుగోలు చేశారు. వారం క్రితం బ్యాటరీ మార్చారు. బ్యాటరీ రీఛార్జి చేస్తుండగా పేలింది. వాహనానికి, పక్కనే కుప్పగా వేసిన పత్తికి మంటలు అలుముకున్నాయి. పేలిన శబ్దానికి నిద్రలేచిన కుటుంబ సభ్యులు నీరు చల్లి మంటలను ఆర్పారు. అప్పటికే రూ.1.20 లక్షల విలువైన ద్విచక్ర వాహనం, రూ.30 వేల విలువైన పత్తి దగ్ధమైంది. కారుకు మంటలు అంటుకుంటున్న సమయంలో మంటలు ఆర్పడంతో భారీ నష్టం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాలకుర్తి: కోతుల బాదకు చెందిన ఓ మహిళపై దాడి చేసిన ఏడుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయి ప్రసన్నకుమార్ తెలిపారు. గ్రామంలో ఇటీవల కులాంతర వివాహం జరిగింది. ఈ విషయంలో కొందరు వ్యక్తులు మహిళపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రహదారి మరమ్మతు చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని తాటికొండ నుంచి ఘన్‌పూర్‌కు వెళ్లే బీటీ రహదారి మరమ్మతు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామం నుంచి ఘన్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులు స్పందించి రహదారి విస్తరణ చేసి మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించి, గ్రామ కార్యదర్శిగా సిద్దుల సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చిల్పూర్: మల్లన్నగండి కుడి కాలువ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం పార్టీ కార్యవర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. మండలంలోని కృష్ణాజిగూడెంలో శనివారం పార్టీ గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామ కార్యదర్శిగా పోలు సంపత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు యాకయ్య, మండల కార్యదర్శి సాదం రమేష్, పరమేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అంచనా

లింగాలఘనపురం: సుప్రసిద్ధ జీడికల్ వీరాచల రామచంద్రస్వామి దేవాలయంలో అభివృద్ధి పనుల కోసం దేవాదాయ శాఖ అధికారులు శనివారం అంచనా వేశారు. ఆలయంలో డిజైన్ పిల్లర్లు, గ్రానైట్ వేసే స్థలం, సీసీ నిర్మాణ పనులు, గదుల నిర్మాణం, భక్తుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు అంచనా వేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ డీఈ రాజేశ్వర్‌రావు, ఏఈ రాజయ్య, సహాయ స్థపతి దామోదర్, ఈవో వంశీ, జూనియర్ అసిస్టెంట్ రాములు, అర్చకులు భార్గవాచార్యులు, మురళీధరాచార్యులు, సిబ్బంది మల్లేశం, భరత్ పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

జఫర్‌గఢ్: పాఠశాల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం ముగిశాయని మండల క్రీడా కన్వీనర్ ఆకుల సాయికుమార్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి మండల విద్యాధికారి పర్వేజ్ ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలకు మండలంలోని 14- 17 ఏళ్ల వయసు గల బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు వెంటనే పరిష్కారం


శిక్షణ పొందిన నీటి సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న జడ్పీ సీఈవో సరిత, ఎంపీడీవో శ్రీనివాస్

రఘునాథపల్లి: గ్రామీణ ప్రజలకు రక్షిత తాగునీరు అందించే క్రమంలో ఏమైనా సమస్యలు ఏర్పడితే మంచి నీటి సరఫరా సహాయకులు వెంటనే పరిష్కరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.సరిత అన్నారు. రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులపాటు మంచి నీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం దాసన్నగూడెం గ్రామాన్ని సందర్శించి తడి, పొడి చెత్త యార్డును పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో ప్రతిజ్ఞ, మానవహారం జరిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

లింగాలఘనపురం: స్వచ్ఛతపై సిరిపురంలో జడ్పీ సీఈవో సరిత శనివారం ఇంటింటా అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులతో స్వచ్ఛత, ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై సమీక్షించారు. తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలందర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, ఏపీఎం శంకరయ్య, సీసీ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు

చిల్పూర్: మండలంలోని నష్కల్‌లో అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఏడీ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు శనివారం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామంలో మట్టి తవ్వకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీవో మాధుసూదన చారి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఆర్థిక సమానత్వం

రఘునాథపల్లి: కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకృతమైన నేపథ్యంలో అణగారినవర్గాల పోరాటాలతోనే ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని ఖిలాషాపురంలో శనివారం ఆ పార్టీ గ్రామ సభ నిర్వహించారు. సీనియర్ నాయకుడు బీమగోని చంద్రయ్య జెండావిష్కరించారు. కనుకారెడ్డి మాట్లాడుతూ .. సామ్రాజ్యవాద దోపిడీ పెరగడంతో పాటు ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని కేంద్రం ప్రైవేట్‌పరం చేస్తుండడంతో సంపద ప్రజలందరికీ చేరడం లేదన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించగా కార్యదర్శిగా శాగ యాదగిరి ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ పాలకుర్తి ప్రధాన రహదారిలో పటేలుగూడెం ఖాసీంగాని కుంట వద్ద శనివారం బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన డొప్ప రాజు ద్విచక్ర వాహనంపై పాలకుర్తి వైపు వెళ్తుండగా పాలకుర్తి నుంచి జనగామకు వస్తున్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించారు.